నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 16 జనవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



వంద పడకల దవాఖాన ఎదుట నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

# నల్లబ్యాడ్జీలతో నిరసన

బెల్లంపల్లి, జనవరి 15 : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బెల్లంపల్లిలోని వంద పడకల దవాఖానలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల అపరిష్కృతంగా ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. యూనిఫామ్‌లు, ఐడీ కార్డులు ఇవ్వడం లేదని ఆరోపించారు. సిబ్బందిపట్ల కాంట్రాక్టర్ తీరు మార్చుకోవాలన్నారు. ఇకనైనా స్పందించాలని, లేదంటే ఈ నెల 20న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

## జాబితా ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

తాండూర్, జనవరి 15 : ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అమలు చేసేందుకు జాబితాను వేగంగా పూర్తి చేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో రైతు భరోసా, రేషన్ కార్డు తదితర సంక్షేమ పథకాలపై బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా పథకం అమలు కోసం రెవెన్యూ, వ్యవసాయ భూముల రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన రైతుల పేర్లను జాబితాలో చేర్చాలన్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు పూర్తి చేయాలన్నారు. అలాగే రేషన్ కార్డుల ప్రక్రియ కూడా పూర్తి చేయాలన్నారు. 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి పథకాల మీద చాటింపు వేయాలన్నారు. తుది జాబితా ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, రేషన్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికీ రేషన్‌కార్డులు**

బెల్లంపల్లి, జనవరి 15 : అర్హులందరికీ రేషన్ కార్డులు అందించేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం బెల్లంపల్లిలోని మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు, మండలంలోని బూధకలాన్ గ్రామంలో నిర్వహించిన రేషన్ కార్డు సర్వేను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించారు. ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇతర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని సూచించారు. 11వ వార్డులో రేషన్‌కార్డు కోసం 1301 దరఖాస్తులు అందాయని, నిబంధనల ప్రకారం అర్హుల జాబితా రూపొందించాలని తెలిపారు.



తాండూర్ ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

## బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్



జైనూర్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

జైనూర్, జనవరి 15 : హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్టు నేపథ్యంలో జైనూర్ మండలంలోని బీఆర్ఎస్ ముఖ్యమైన నాయకులను మంగళవారం అదుపులోకి తీసుకొని జైనూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంక్రాంత్రి నాడు నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటు అని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఆత్రం శంకర్ మండిపడ్డారు. ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్తారనే ఉద్దేశంతోనే ముందస్తుగా అరెస్టు చేశారని, ప్రశ్నించే వారిని కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అరెస్టైన వారిలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మడవి భీంరావ్, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావ్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సోన్‌కాంబ్లె సిద్ధార్థ్ ఉన్నారు.

# నత్తనడకన యాసంగి సాగు

**1.06 ఎకరాల్లో వరి పంట అంచనా..**

- కానీ ఇప్పటి వరకు వేసింది 33 వేల ఎకరాల్లోనే.. ● రైతు భరోసా రాక ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు
- చివరాఖరకు పంటలకు నీరందుతుందో లేదోనన్న ఆందోళన ● కేసీఆర్ హయాంలో రంది లేకుంట ఎవుసం



వరి నాట్లు వేసిన పొలం



ఎల్లంపల్లి ప్రాజెక్టు

మంచిర్యాల (ఏసీసీ), జనవరి 15 : జిల్లాలో యాసంగి సాగు నత్తనడకన సాగుతున్నది. కేసీఆర్ సర్కారు కల్పించిన సకల సౌకర్యాలతో రంది లేకుండా పంటలేసిన రైతాంగం.. ప్రస్తుత ప్రభుత్వ పుణ్యమాని అరిగోస పడుతున్నది. ఇప్పటి వరకు రైతు భరోసా ఇవ్వకపోవడంతో పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యాపారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నది. మరోవైపు ప్రాజెక్టులు, చెరువుల నిర్వహణపై కాంగ్రెస్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండగా, చివరి వరకు ఆయకట్టుకు సాగు నీరందుతుందో లేదోనని మదనపడుతున్నది.

**33 వేల ఎకరాల్లోనే నాట్లు..**

జిల్లాలో ఈ యేడాది యాసంగిలో 1,24,292 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 1.06 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయనుండగా, మిగతా 18 వేల ఎకరాల్లో రకరకాల పంటలు వేసే అవకాశమున్నది. వరి విత్తనాలతో పాటు యూరియా 14,645 మెట్రిక్ టన్నులు, డీఏపీ 5966 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 11563 మెట్రిక్ టన్నులతో పాటు ఇతర ఎరువుల అవసరముంటుందని ప్రతిపాదనలు రూపొందించారు. ఇప్పటికే రైతులు సాగులో నిమగ్నమయ్యారు. 33 వేల ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేసినట్లు తెలుస్తుండగా, మరో 70 వేల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉంది. అక్కడక్కడా జొన్నలు, మొక్కజొన్న, పెసళ్లు, వేరుశనగ తదితర పంటలు వేసినట్లు తెలుస్తున్నది.

**రైతుభరోసా రాక.. అప్పలు..**

అధికారంలోకి రాగానే రైతు భరోసా ద్వారా ఎకరాకు రూ. రూ.15 వేలు అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ హామీ నెరవేర్చింది లేదు. కేసీఆర్ సర్కారులో సాగు సమయానికి రైతుల ఖాతాల్లో ఎకరాకు రూ. 10 వేలు జమ చేసేవారు. ఒక విడుతకు దాదాపు రూ. 170 కోట్లకు పైగా సాయాన్ని అందించేవారు. సకాలంలో డబ్బులు పడడం వల్ల రైతులు రంది లేకుంట సాగు చేసుకునేవారు. కానీ, కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పెట్టుబడి సాయాన్ని అందించలేదు. పెట్టుబడి సాయం కోసం ఎదురు చూసి విసిగి వేసారిన రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారస్తుల దగ్గర అప్పులు చేస్తున్నారు. కొందరికి అప్పు పుట్టక సాగుకు వెనుకాడుతున్నట్లు కూడా తెలుస్తున్నది.

**సాగు నీటి కష్టాలు అధిగమించేనా..?**

బీఆర్ఎస్ సర్కారు ప్రాజెక్టులు, చెరువులను పునరుద్ధరించి రెండు పంటలకు సరిపడా సాగు నీరందించింది. భూగర్భ జలాలు పెరగడంతో రైతాంగం ఎంచక్కా పంటలు వేసుకొని మంచి దిగుబడులు సాధించింది. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. గత యాసంగిలో ఎల్లంపల్లి, కాళేశ్వరం, దాని అనుబంధ బ్యారేజీల నుంచి నీరందకపోవడంతో రైతన్నలు అరిగోస పడ్డారు. ఎండిపోతున్న పంటలు చూసి గుండెలు బాధుకున్నారు. మరి ఈసారి పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళనకు గురవుతున్నారు.



నువ్వుల నూనె తాగుతున్న మెస్రం నాగుబాయి



ఆలయంలో పూజలు చేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# ఖాందేవుడిది దశాబ్దాల చరిత్ర

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ● మూడు కిలోల నువ్వుల నూనె తాగి దైవభక్తిని చాటిన నాగుబాయి

నార్నూర్, జనవరి 15 : దశాబ్దాల చరిత్ర గల ఖాందేవుడి మహిమ చాలా గొప్పదని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ కేంద్రంలో శ్రీశ్రీశ్రీ ఖాందేవ్ జాతర మహాపూజతో మంగళశారం వైభవంగా ప్రారంభమైంది. మంగళవారం పుణ్యక్షేత్రంలో తైలం తాగించే మహోన్నత కార్యక్రమం నిర్వహించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మహారాష్ట్రలోని కేలాపూర్ ఎమ్మెల్యే తొడసం రాజు పాల్గొన్నారు. సంప్రదాయంగా స్వాగతం పలికారు. ఆలయ సన్నిధిలో పూజలు చేశారు. ఆ వంశీయులు ఇంటి వద్ద తయారు చేసిన శుద్ధమైన మూడు కిలోల నువ్వుల నూనె తాగారు. మెస్రం వంశం ఆడబిడ్డ, కటోడా ఖాందేవ్ ప్రతిమలకు నైవేద్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా జివితీ తాలుకా కొద్దేపూర్ గ్రామానికి చెందిన మెస్రం నాగుబాయి తమ ఇష్టదైవాన్ని తలచి విశ్వశాంతిని కోరుతూ మూడు కిలోల తైలం తాగి దైవభక్తిని చాటుకున్నది. వారి ఆచారం ప్రకారం మూడేళ్లపాటు తైలంగా తాగి మొక్కును తీర్చుకున్నది. ఆడబిడ్డ దంపతులను నూతన వస్త్రాలతో సన్మానించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మినీ దర్బార్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. సృష్టిలోని ఏ దేవస్థానంలో ప్రత్యక్షంగా నూనె తాగే ఆచారాన్ని చూడలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పీఠాధిపతి తొడసం భీంరావ్, కటోడాలు తొడసం బాపురావ్, తొడసం ఆనంద్‌రావ్, తొడసం రాజుపటేల్, పాండు పటేల్, ఆదివాసీ జేఏసీ మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ మాజీ చైర్మన్ తొడసం నాగోరావ్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, రాయి సెంటర్ జిల్లా సార్‌మెడి మెస్రం దుర్గు పటేల్, ఉపాధ్యాయులు మెస్రం శేఖర్‌బాబు, మెస్రం లింగు పాల్గొన్నారు.

## అర్హుల జాబితా రూపొందించాలి

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 15 : ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి గ్రామ సభల ద్వారా అర్హుల జాబితాను రూపొందించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, ఎం. డేవిడ్‌తో కలిసి పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియ జిల్లాలో 97 శాతం పూర్తి అయిందని, మిగతా వారి వివరాలు నమోదు చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



జంగల్ సఫారీలో ఎమ్మెల్యే, కలెక్టర్, ఎఫ్‌డీవో

## జంగల్ సఫారీ ప్రారంభం

హాజీపూర్, జనవరి 15 : లక్షెట్టిపేట రేంజ్‌లోని హాజీపూర్ మండలం గఢ్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎంసీసీ క్వారీ అడవిలో ఏర్పాటు చేసిన గాంధారీఖిల్లా జంగల్ సఫారీని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అటవీ శాఖ అధికారి శివ్‌ఆశీష్‌సింగ్‌తో కలిసి ప్రారంభించారు. సఫారీ ఆవరణలో మొక్క నాటి సఫారీ రూట్ మ్యాప్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ 25 కిలో మీటర్లు విస్తరించి ఉన్న జంగల్ సఫారీలో వివిధ రకాల వన్యప్రాణులను ప్రత్యక్షంగా వీక్షించి అనుభూతి పొందవచ్చునన్నారు. రానున్న రోజుల్లో జంగల్ సఫారీకి పర్యాటకుల తాకిడి పెరిగి రాష్ట్రస్థాయిలో మంచిర్యాల గుర్తింపు లభిస్తుందన్నారు. జంగల్ సఫారీ విజయవంతమైతే పర్యాటక కేంద్రంగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, జిల్లా అటవీ అభివృద్ధి అధికారి సర్వేశ్వర్, లక్షెట్టిపేట రేంజ్ అధికారి అత్తె సుభాష్, నాయకులు, ఫారెస్టు అధికారులు, తదితరులు ఉన్నారు.



జన్నారం బైసన్ కుంటవద్ద పక్షి ప్రేమికుల బస కోసం ఏర్పాటు చేసిన గుడారాలు

## 18,19న బర్డ్‌వాక్ ఫెస్టివల్

జన్నారం, జనవరి 15 : కవ్వాల్ అభయారణ్యంలోని జన్నారం డివిజన్, రేంజ్ పరిధిలో ఈ నెల 18,19 తేదీల్లో బర్డ్‌వాక్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్ సుష్మారావు తెలిపారు. పక్షి ప్రేమికులు 18న సాయంత్రం 4 గంటలకు ఫారెస్ట్ గెస్ట్‌హౌస్ వద్ద ఒక్కొక్కరు రూ. 2 వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వారిని సాయంత్రం 4.30 గంటలకు సఫారీలో బైసన్‌కుంట అడవుల్లోకి తీసుకెళ్తారని, 19న ఉదయం 11.30 గంటలకు బర్డ్‌వాక్ నిర్వహిస్తామని, అనంతరం టీడీసీ సెంటర్ వద్ద భోజన వసతి కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి ఏవైనా సందేహాలుంటే 0441057771, 9989591096 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

# ‘అపార్’ పూర్తయ్యేనా..!

**ప్రతి విద్యార్థికి ప్రత్యేక ఐడీ నంబర్ కేటాయించాలని నిర్ణయించిన కేంద్రం**

- ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ● ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15.44 శాతమే నమోదు
- సమీపిస్తున్న గడువు ● నమోదులో తీవ్ర జాప్యం ● ఆసక్తి చూపని విద్యార్థులు, తల్లిదండ్రులు




అపార్ కార్డు

నస్పూర్, జనవరి 15 : దేశ పౌరులందరికీ ఆధార్ నంబర్ ఇచ్చినట్లుగానే.. ప్రతి విద్యార్థి సమాచారం తెలుసుకునేందుకు అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ నంబర్ కేటాయించాలని కేంద్రం ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి విద్యార్థికి ప్రత్యేకంగా 12 అంకెల విశిష్ట నంబర్ ఇవ్వాలని ఆదేశాలిచ్చింది. విద్యార్థి ఏయే సంవత్సంలో ఏ స్కూల్‌లో చదివాడు.. ఉత్తీర్ణత, మార్కులు, హాజరుశాతం తదితర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ విధానం వల్ల ప్రతి విద్యార్థి పూర్తి సమాచారం కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో భద్రంగా ఉంటుంది.

**ఒకటి నుంచి పన్నెండో తరగతి వరకు..**

ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఒకటి నుంచి 12వ తరగతి వరకు చదివే ప్రతి విద్యార్థికి నంబర్ కేటాయించాలి. పాఠశాల స్థాయిలోనే విద్యార్థి జాయిన్ అయ్యే సందర్భంలోనే విద్యార్థి ఆధార్‌తో పాటు తదితర సమాచారం సరిచూసుకోవాలి. ఒకసారి నమోదు చేస్తే ఇక శాశ్వతంగా ఎలాంటి మార్పులు చేయడానికి వీలు పడదు.

**ఆలస్యమెందుకో..**

ఈ ప్రక్రియ కోసం ప్రభుత్వం ఈ నెల 31 వరకు గడువు విధించగా, ఆ లోగా పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటి వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 15.44 శాతం మాత్రమే పూర్తయ్యింది. ఆదిలాబాద్ జిల్లాలో 1.96 శాతం, ఆసిఫాబాద్ జిల్లాలో 8 శాతం, మంచిర్యాల జిల్లాలో 19 శాతం, నిర్మల్‌లో 6 శాతం మాత్రమే పూర్తయ్యింది. ఈ లెక్కన ఎంత ఆలస్యమవుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే ఆధార్‌లో తప్పులున్న వారు.. వాటిని సరి చేసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. ఒకవేళ ఏమైనా తప్పులు దొర్లితే మళ్లీ సరి చేసుకునే అవకాశముండదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు. దీనికి తోడు యూడైస్‌లో తప్పులుంటే సరి చేయాల్సిన ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు మొన్నటి వరకు సమ్మెలో ఉండడం.. జిల్లా స్థాయి అధికారులు పనిభారంతో ఎక్కువ సమయం కేటాయించకపోవడం.. ఈ నెలలో సెలవులు ఎక్కువ సంఖ్యలో రావడం వల్ల తీవ్ర జాప్యమవుతున్నది. ఏది ఏమైనా అపార్ పూర్తి కావాలంటే తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరముందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.



నాయకులతో కలిసి వేడుకలు జరుపుకుంటున్న మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

## ఇంటింటా సంక్రాంతి సంబురాలు

మంచిర్యాల అర్బన్/ఆసిఫాబాద్ టౌన్, జనవరి 15 : ఇంటింటా సంక్రాంతి సంబురాలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కాలనీలోగల తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తన కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకొని ఆయనకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌లో నిర్వహించిన కబడ్డీ పోటీలకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. తిర్యాణి మండల మైఖేల్ యార్క్ గోండు మహిళా సంఘం నాయకులు, గోండు యువజన సంఘం నాయకులు ఎమ్మెల్యే కోవ లక్ష్మిని ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమెను శాలువాతో సత్కరించారు.



విజేతలతో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి